# దౌర్జన్యం

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి
(శ్రీ వాణీ)

"ఎక్కణ్ణించి ?"

"విశాఖపట్నం నించి."

"?"

"...............''

"యోగానందదగ్గర నించా ?"

(నవ్వి) "కాదు."

"చిన్న మామయ్య."

"ఊహుఁ."

"జనార్దనం."

"అబ్బే!"

(విసుక్కుంటూ)

"వెఱ్ఱాస్పత్రిలో ఉన్న ఓ వెఱ్ఱి వెధవ దగ్గరనుంచి - ఎవరిదగ్గరనుంచైతే ఎవడి క్కావాలి ?"

"అట్లా ఊరుకోరాదూ ? ఎందుకూ ఈపరీక్షలన్నీని-సీకొచ్చిన ఉత్తరాలగురించి ఇంత నిర్బంధంగా అడుగుతున్నానా?"

"మాకు లక్షచోట్లనించి వస్తాయి, వెడతాయి. వాటిగురించి ఆడపీనుగులు అడగడాని కధికారం లేదు."

(గంభీరంగా) "మాకు వచ్చినవాటిని గురించి నిలదీసి కనుక్కోమని శ్రీమగవారి కధికారం ఇచ్చిన దెవరు?"

"భగవంతుడు."

"కాదు."

"ఎవరు?"

"దౌర్జన్యం."

" ! "

* * * *

మేడమీద—పలచని పైరుగాలి—అలకలు ఎదురీత నేర్చుగుంటున్నాయి. కిటికీకి అడ్డంగా ఉన్న ఆకుపచ్చపూల కర్టెన్ కొంచెం తొలగించింది. శూన్యంగా చూస్తున్నది. కన్నులు—ఆలోచనాలసములు— చేతులు వణకినవి—కవరు కిందపడింది. తనలో—నేను తప్పుచేస్తున్నానా ? కాదని తల ఊగింది. కన్నులు మూసుకున్నవి.

జనరల్ హాస్పటలు-ఇసక కొండమీద-ఆనాలుగోరోజుని-అతడు ఇంకొకరు క్రిష్ణయ్యను హాస్పటలు చేర్చారు. మామయ్య మంచంపక్కనే అతని మంచం. కాలేజినించి వచ్చి విద్యార్థులు చూసి వెడుతున్నారు. ఏంనయంలేదు. ఆనాడు మామకి ఒకటే వాంతులు, తలనొప్పి. బాధపడిపడి సొమ్మసిలి నిద్రపోయింది. నామనస్సు చాలా వికలమయింది. నిద్రపట్టడం చూసి అతని పక్కమీంచి లేచి సముద్రపుగాలి పీల్చుకుంటున్న కిటికీదగ్గర నిలుచున్నాను.

అంతమంది చూడ్డానికి వచ్చినా కృష్ణయ్యకి అతన్ని చూస్తేనేగాని తోచదు. ఆ జాలితో నిండిన కళ్లు, ప్రసన్న సుస్నిగ్ధమయిన ముఖం—అతని చల్లని మెత్తనిచేయి కృష్ణయ్యకి అమృతప్రాయం.

అతడు నేను చూస్తుండగా అన్నం తిన లేదు. అలాగే కనిపెట్టుకుని చూస్తుండేవాడు పాపం! అతడుగూడ చాలా నలిగిపోయాడు. కాని గంభీరమైన ముఖం-"అబ్బా" అని కృష్ణయ్య ఏ బాధతోనో అరిస్తే—అంత మనోజ్ఞంగా మెరిసేకళ్లు—నీళ్లతో నిండి అతనివైపు తిరిగేవి. ఆసంవిధానం చూస్తే కడుపు చెక్కలయ్యేది.

సముద్రపుగాలికి ఇటూ అటూ తిరుగుతున్నాను. కృష్ణయ్య కళ్లుమూసుకున్నాడు. పక్కని-అతడు-అక్కడ లేడు. ఎప్పటిదో "శారద" ఉంది. ఏం తోచక అది తీద్దామా అనిపించింది. ఏమనుకుంటాడో? అంత మంచివాడు - ఏమనుకుంటాడు. తీసి రెండు పుటలు తిరగేశాను. రెండో పుటమీద Viraja అని ఉంది. అది అతని పేరు గాబోలు-వింతగా ఉంది.

అతడు వచ్చాడు. అక్కడ పెట్ట బోయాను. తప్పులేదు, చూడండి అన్నాడు.

ఏం తోచనప్పుడు-ఏదో మాట్లాడుకునేవాళ్లం - అప్పుడప్పుడు. ప్రసన్నంగాను, స్నిగ్ధంగాను ఉండేది మాప్రసంగం.

ఆ రుజాపరిక్లిన్నహృదయాలు రెంటికి మానవత్వవాసన తగ్గింది. మాపవిత్రస్నేహం వాటి కళ్లకి అసహ్యంగా తోచలేదు.

యేసుప్రభువు కరుణవలన మాకృష్ణయ్యకి ఆరోగ్యం కలగాలి—అన్నాడు, ఒక ప్రసంగంలో—అదరిపడ్డాను. ఇతడు కిరస్తానీ, ముట్టుకుంటున్నాను. శుద్ధమైన వైదికకుటుంబం—పైగా.........తల తిరిగింది. "మంచి అన్నది మాలఅయితే మాలనే అగుదున్" న్యూమోనియాజ్వరం కృష్ణయ్యను తినేసింది. మలేరియాజ్వరం మామామను తేల్చింది.

* * * *

"గోహారు."

"కాదు సులోచన."

"ఏమైనా ఐరల్."

"అందుకే నేను రాను."

"పోనీ టాకీకి."

"ఏమిటి?"

"ఇంద్రసభ."

"ఏడిసినట్టుంటుంది."

"పోనీ—ప్రహ్లాద."

"కదుంగడు."

"ఉస్-ఏమి టాగోడవ - మొగాళ్లతో అన్నిటికీ సిద్ధం, తనూ ఓమనిషిలాగ."

"..............."

"..............."

"హరీ!"

"ఓయ్."

"ఎక్కడికేమిటి ప్రయాణసన్నాహం?"

"ఎక్కడికీ లేదు."

"మరేమిటీ?"

"అక్క ఏదో అడుగుతున్నది. చెబుతున్నాను."

"ఏడిశారు-పడుకొండి-లవలీ!"

"ఆఁ."

"కుర్రాడితో సమంగా ఏమిటావాదం? అమ్మ ఒక్కలా దేవులాడుతోంది. కాస్త భాగవతం చదివి వినిపించరాదూ, మాలసినీమాల కెళ్లి మతిపోగొట్టుకొనేకన్న?"

"కళను ఆరాధిస్తే మతిపోతుందా?"

"ఓ మహారాజులాగ—అనీకాక ఆడజాతికి—కళను ఆరాధించడం ఎవడు చెప్పాడు, ఏదో పెద్దల ఆచారంలో నడిచిపోయి—రామా కృష్ణా అనుకోక—"

"పచ్చికాయదెచ్చి పడవేయ ఫలమానె?"

* * * *

"అక్కా! 'యడవిల్లి' 'పెర్సనాలిటీ' చూశావా?"

"దానికి తగిన కళాభిజ్ఞత ఉంది."

"సంస్కృతం వచ్చనుకుంటా."

"దర్భాంకురేణ—ఎంత బాగుంది!"

"కాని—"

"ఏం?"

"పొందు బాగా ప్రొడ్యూసవడంలేదు."

(నవ్వుతూ) "నూతన తెలుగుటాకీ."

"లవలీ! లవలీ!"

"?"

"..................."

"అబ్బ! విరజానంద—ఎన్నాళ్లకి—"

"నిన్న సాయంత్రం మెయిల్లో వచ్చాను."

"ఉత్తరం అందింది."

"సాహసం."

"నీ మొహం - నిన్న మాయింటికి రాలేదేం?"

"ఒకటే ఆవేదనపడ్డాను, నిన్ను చూద్దామని. కాని అపరిచితులలో ఉన్న యువతిని చూడ్డానికి ఎట్లా సాహసించేది?"

"మొగజాతిలో ఉన్న దౌర్బల్యమేఅది."

"సంఘం-బ్రాహ్మలు కోసేస్తారు."

"స్నేహం సాంఘికభౌతికనియమాలను తొక్కి నడుస్తుంది. అడ్డువస్తే తన్నిపారేస్తుంది."

వెన్నెల్లో నడుస్తున్నారు. ముఖాలు తళతళ మెరుస్తున్నాయి. లవలి రేగిన జుట్టును వెనక్కి తోసుకుంటూ-(ఆదరంగా) "విరజా, ఎన్నాళ్లకి కనిపించావోయి! నేను సినీమాకి రాకపోతే అసలే కనిపించవన్నమాట."

గోదావరిగాలి విపరీతంగా విసురుతున్నది. లవలిఅలకలు జీబుగా చెదురు

తున్నాయి. విరజ తన మెత్తని వేళ్లతో సర్దుతూ—

"అంతే"

హరికి అసహ్యం—కోపం—"ఎవడితను, అక్కని ముట్టుకుంటాడు. అందుకే అన్నయ్య వెధవసినీమాలకి వెళ్లొద్దంటాడు."

* * * *

"మొండిపట్టు పట్టకు, కోపం వస్తుంది నాకు. 'హరి' పరీక్షలు అయితే ఆదివారం వాడు వస్తాడు."

"అన్నయ్యా! ఏం భయం? ఇక్కడ కూచుంటాను. అక్కడ దిగుతాను. ఈ మాత్రం వ్యక్తిత్వమేనా మా కుంచ గూడదూ. గాలిగూడా దగ్గిరుండే పిల్చిస్తా నంటావేం?"

"తిన్నగా ఎక్కగలవా, దిగగలవా? ఎవడేనా కాస్త హాట్ అంటే హడిలి చక్కా పోవలసిందే. ఈమధ్య ఇదోటి నేర్చారు. అయిదవ మహిళాసభ, ఆరవమహిళా సభ అని పెద్దపెద్ద జాపితాలు ప్రకటించడం, సేలం చీరలు, సిల్కుచీరలు కట్టుకుని తలనిండా పూలు పెట్టుకొని తిప్పుకుంటూ, తీసుకుంటూ సభలో కెళ్లి గోదావరివరదల సంగతి, కొత్తా వకాయఘాటుసంగతి చెప్పుకుంటూ, చెప్పింది వినకుండా చేతులెత్తి వచ్చేస్త్రీరత్నాలికి స్వేచ్ఛ కావాలి! స్వయంగాపిలుస్తారుగాలి!"

ఈవాగుడికి లవలికి కోపం, నవ్వు వచ్చాయి. ఆపుకొని

"వీళ్ల నిట్లా తయారుచేసిం దెవరు?"

"వాళ్ల ఖర్మం."

"కాదు, మీాఋషులు చెప్పినధర్మం."

"ఇంకేం?"

"వెడతాను."

"వద్దు."

"వెడితే?"

"శిక్ష."

"చూద్దాం."

* * * *

వాల్తేరుస్టేషను.

విరజానంద ప్లాట్ఫారంమీాద తిరుగుతూ

"ఉత్తరాన్నిబట్టి ఈవేళ రావాలి"

లవలి రాత్రి 9 గంటల పాసింజరు దిగి ఇటూ అటూ చూస్తూ

"ఇదిగో! ఇక్కడ శ్రీవారు సన్నిధి సాయించారు!"

"ఈఉపోలక్మికోసం."

"మావదినకి కొంచెం సుస్తీగా ఉందిట. చూడ్డానికి వచ్చాను."

"కాదు—ఒకశిశిరహృదయానికి వసంతమాధుర్యం ధారపొయ్యడానికి."

"ఇప్పు డెక్కడికి?"

"బీచికి."

"వాళ్లింటికో?"

"తరవాత."

సముద్రం చంద్రుణ్ణి చూసి పొంగి పోతున్నది. హోరుమని పెద్దపెద్ద కొండంత తరంగాలు ఒకటికొకటి కొట్టుకొని ఘోష పెడుతున్నాయి.

సముద్రానికిదగ్గరగా, ఇసకమీద నడుస్తో విరజ-"కొంచెంనడుద్దామా? ఇక్కడకూచుందామా?"

"కూచుందాం."

కూర్చున్నారు. కెరటాల్లోంచి ఎగిరి చిన్నచిన్న తుంపురులు మొహంమీద పడుతున్నాయి. ఇసక గుప్పిటతో తీసి చిమ్ముతూ విరజ, "చూడు లవలీ, ఈవెన్నెల్లో నీమొహం ఎంతమెరుస్తోం దనుకున్నావు! ఇంకో రెండుమల్లెపూలు పెడితే ఏం ఆజడలో?"

"అమ్మా! ఎంతాశ!"

పాలపిట్టరంగు సిల్కుచీర - మెడకింద నలుపలకలుగా-చేతులు పొట్టిగా కత్తిరించిన పట్టు కాఫీరంగు సిల్కుబాడీ - లేడీరబ్బరు బూటు-బర్మాజడ-దానిలో పరిమితంగా మల్లెపూలు, ఆగుండ్రతనంలో - కోలతనం ఉన్న ముఖం, ఇందీవర సౌకుమార్యాన్ని చిమ్ముతున్న కళ్ల మెరుపు-ముఖం ఎటుతిప్పితే అటు అందం కదులుతున్నది. చామనచాయ. ఆనందవివశుడై విరజ—

"ఎనకజల్మములోన ఎవరమోనంటె."

"అదొద్దు-'ఉత్తమాయిల్లాలు' పాడు."

"నన్నుసురుపెడితే దోసమోయి."

"మొగాళ్ల హృదయంలాగే గొంతు కూడా."

విరజ దీనంగా

"పాటలకు నోచుకొనని నిర్భాగ్య గళము."

"అబ్బ! నిన్నుకాదోయి మిగిలిన మొగాళ్లని..." (నవ్వుతూ)

"ఏదీ! నువ్వు పాడు లవలీ! ఆడగొంతులో యెంకిపాట లెలా ఉంటాయో?"

"యెన్నెలంటే పాట కెంత మను సౌతాదో
పాటసాగేతలికి పయనమేమవుతాదో
ఆపలేనే యెంకి ఈపడవయిసురూ"

కోకిల 'కూ' అంటే చాలు గుండె దడట్టుకుంటుంది.

విరజ ఉన్మత్తుడై వెన్నెల్లో ఆడిపోయాడు. ఏదో ఆవేశంతో లవలిని గట్టిగా హృదయానికి అదుముకోబోయాడు. లవలి పాట ఆపింది. కొంచెం వెనక్కితగ్గి—

"విరజా, పశుత్వానికి దగ్గర అవుతున్నావు".

"........................"

"గులాబిని చూసి సంతోషించు.—నలిపి వాసనచూడబోకు. కావలిస్తే కరివేపాకును అట్లా చెయ్యి."

"హృదయం బద్దలైపోతున్నది."

"పుంస్త్వం రాక్షసత్వానికి దగ్గరా?"

"ఏమో?"

“నేను నీకు బానిసనుగాను — స్నేహితురాలిని.”

“ఏమో?”

*   *   *   *

“గుమ్మంలో కాలుపెట్టడానికి వీలు లేదు”.

“కారణం?”

“తెలిసింది.”

“ఏం చేశాను?”

“తలవంపులు.”

“ఎట్లా?”

“మామయ్యగారింటి కెడతానని అడ్డమైన మాలపీనుగులుతోటి తిరిగి జాతి, నీతి లేక ఇంకా ‘ఎట్లా,’ సిగ్గులేదూ?”

“తప్పుచేస్తే సిగ్గుపడాలి — స్నేహం హృదయానికి సంబంధించినది. దానికి జాతితో నియమంలేదు. నీతంటే మీనిర్వచనం వేరు; మానిర్వచనం వేరు. నీతికి కాల పరిణతినిబట్టి నిర్వచనా లున్నాయి. ఒకప్పుడు నీతిఅయినది ఇంకోఅప్పుడు అవినీతి కావచ్చు. అదీ కాక జాతిజా తంటావు— నిజం ఆలోచిస్తే ఇన్నిజాతు లేమిటి? వాళ్ల తలకాయ!

‘మంచిచెడ్డలు మనుజులందున ఎంచి చూడగ రెండెకులములు.”

“ఓహో! ఏం మెట్టవేదాంతమండీ! పాలవంటి వైదికకుటుంబాన్ని బుగ్గిగలపదల చావు. నీతో మాటలాడితే సచేలస్నానం చెయ్యాలి. ఇంక దయచెయ్యి నీయిష్టం వచ్చినదగ్గిరకి. దేవతార్చనవేళయింది, నే వెళ్లాలి.”

“మనుష్యులంటేఇంతదయా, సానుభూతీ చూపుతున్నావు—ఇంక దేవతలు తక్కువ. అయితే—నాన్నకట్టించిన ఈదివ్యభవనంమీద అతని అపత్యానికి హక్కు సమానం. దీనికి నీపెత్తన మేమిటి?”

“పిట్టకూతపట్టింది. ఇన్నిమాటలు నాతోలేవు. దిక్కున్నచోట చెప్పుకో. తలుపు వేస్తున్నా.”

లవలి తలఊగించి

“యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జనః.”

---